క్లుప్తంగా

ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయొద్దు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామన్నపేట: ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలను ప్రభుత్వం మానుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ గొరిగె సోములు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంశ్రీ మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలు, జాతీయ నూతన విద్యావిధానం అమలుచేస్తే ఐసీడీఎస్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అవుతుందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17, 18 తేదీల్లో 48 గంటలపాటు ధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, నకిరేకంటి రాము, గురుకు లలిత, సువర్ణ, రేణుక పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

మోత్కూరు: గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన మల్లపాక సాయిలు అనారోగ్యం బారిన పడ్డాడు. అతడి స్నేహితులైన మోత్కూరు జెడ్పీ ఉన్నత పాఠశాల 1987–88 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం అతడిని కలిసి పరామర్శించి, రూ.40 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారిలో సామ అశోక్‌రెడ్డి, బోయిని శ్రీను, బుస్సా శ్రీను, మహేశ్వరం మధు, రఫీ, పురుగుల సమ్మయ్య, బత్తిని సత్యనారాయణ, దోర్నం వెంకన్న, మేడిగ రవి, రఘువర్ధన్‌రావు, తాడోజు రవీందర్‌రెడ్డి, బుషిగంపల యాదయ్య ఉన్నారు.

ఆధ్యాత్మిక రచనలు, ఆత్మజ్ఞానంపై అవగాహన

వలిగొండ : మండలంలోని గొల్నేపల్లిలో శనివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన 101 ఆధ్యాత్మిక రచనలు, ఆత్మ జ్ఞానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ నూతన తెలుగు సంవత్సర క్యాలెండర్లు అందజేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు దేవేంద్ర, శంకర్, లింగస్వామి రాము, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, సాయిరాజు , అశోక్, బుచ్చిబాబు, లలిత, ధనలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వినతి



డీఆర్‌డీఓ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి: వడదెబ్బకు గురై మృతి చెందిన ఉపాధి కూలీలు లింగమ్మ, నర్సమ్మకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి, కొండమడుగు నర్సింహ కోరారు. ఈ మేరకు శనివారం స్థానికంగా డీఆర్‌డీఓ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్రం కొత్త విధానాలు తీసుకురావడం వల్ల కూలీలు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోల్, కొండపురం యాదగిరి, రాంచంద్రం, అశోక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వార్షికోత్సవం



పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

యాదగిరిగుట్ట రూరల్: మండలంలోని మాసాయిపేట గ్రామంలోని ముద్గల ఋషికులం పాఠశాలలో శనివారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని పాఠశాల చైర్మన్ శ్రీ మాధవ శర్మ ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్కృత స్కాలర్ కృపాలాచార్య, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ రాహుల్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరి చేను జీవాల పాలు

గుండాల: పెట్టుబడులు పెట్టి వరి సాగు చేసి చేతికి వచ్చే సమయంలో ఎండి పోతుండటంతో చేసేదేమిలేక జీవాలను మేపుతున్నారు. గుండాల మండలానికి గోదావరి జలాలు రాకపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. రామారం గ్రామానికి చెందిన ముక్కెర్ల లింగయ్య 2 ఎకరాలు వరి సాగు చేస్తే సుమారుగా ఎకరంన్నర వరి పొలం ఎండిపోగా.. చేసేదేమిలేక గొర్రెలను మేపుతున్నాడు.



రామారం గ్రామంలో ఎండిన వరి చేనులో జీవాలను మేపుతున్న రైతు

పెట్టుబడి కూడా రాకపాయే

ఆత్మకూరు(ఎం): మండలంలోని రహీంఖాన్‌పేటలో రైతు ఆవుల మల్లయ్యకు మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి నాటు పెట్టాడు. మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. భూగర్భ జలాలు అడుగంటడంతో పొలం ఎండిపోయింది. దీంతో పశువులకు మేతగా వేస్తున్నాడు. పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.



పశువుల మేత కోసం ఎండిన వరి చేను కోస్తున్న రైతు మల్లయ్య

నీళ్లు లేక నెర్రెలు

- యాదగిరిగుట్ట మండలంలో నీరందక ఎండుతున్న వరిపొలాలు
- పశువులు, గొర్రెలకు గ్రాసంగా పంటలు
- ఆర్థికంగా నష్టపోతున్నామని రైతుల ఆవేదన



మహబూబ్‌పేట గ్రామంలో వరిచేనులో ఆవును మేపుతున్న రైతు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలంలో యాసంగిలో సాగు చేసిన వరి పంటలు ఎండిపోతున్నాయి. వేసవి రావడంతో బావులు అడుగంటడం, బోర్లలో నీళ్లు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండిన పంట పొలాల్లో జీవాలను మేపుతున్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

మండలంలో ఎక్కువ శాతం రైతులు బోరు బావుల మీదనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. తెల్లవారుజామున బోరు బావుల్లో కొద్ది నీళ్లు మాత్రమే వస్తుండడంతో కాపాల కాసి మరీ రెండు గంటలపాటు మోటార్లు వేసుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ఎండిపోయిన 197 ఎకరాలు

యాదగిరిగుట్ట మండలంలో 2024–25 సంవత్సరం యాసంగిలో 11,910 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. పొలాలకు నీళ్లు అందకపోవడంతో 197 ఎకరాలు ఇప్పటివరకు ఎండిపోయాయి. కాగా గత సంవత్సరంతో పోలిస్తే, ఈ యేడాదిలోనే పంటలు ఎక్కువగా ఎండిపోతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

గోదావరి జలాలతో చెరువులు నింపినా..

మల్లన్న సాగర్ జలాశయం నుంచి కాలువల ద్వారా నీటిని విడుదల చేసి యాదగిరిగుట్ట మండలంలోని 23 గ్రామాల్లో 21 చెరువులను నింపారు. దీంతో పంటలు సమృద్ధిగా పండుతాయని, రైతులు గతంలో కంటే ఎక్కువ వరి పంటలను సాగు చేశారు. మత్స్యకారులు చేప పిల్లలను సైతం చెరువుల్లో పోసారు. తీరా వేసవి రాగానే భూగర్భ జలాలు అడుగంటి పోవడం, చెరువుల్లో ఉన్న నీళ్లు సరిగ్గా అందకపోవడం, మరి కొన్ని చెరువులు ఎండిపోవడంతో వరి పంటలు కూడా ఎండిపోతున్నాయి.

బంగారం కుదవపెట్టి సాగు చేశాను



వరి సాగు చేయడానికి ఐదు తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి, మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. ఇప్పుడేమో, నీళ్లు లేక పంట అంతా ఎండిపోయింది. బోరు నుండి నీరు రాకపోవడంతో పొలం పారడం లేదు. ప్రస్తుతం ఏం చేయాలో తోచడం లేదు. ప్రభుత్వం ఆదుకుని పంటకు నష్టపరిహారం అందజేయాలి.

– శ్రీకాంత్, రైతు, మాసాయిపేట

గొర్రెలు మేపుకునేందుకు ఇచ్చాను



వ్యవసాయం చేద్దామని గ్రామంలో ఏడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశా. మొదట్లో బోరు నీళ్లు బాగానే వచ్చాయి. మధ్యలో బోరు పూర్తిగా అడుగంటిపోయింది. పంట ఎండిపోవడంతో గ్రామంలో గొర్రెల కాపరికి వరి పంటను కోసుకోమని చెప్పాం. పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరు అయింది.

– గడ్డం భాస్కర్‌రెడ్డి, మాసాయిపేట

పశువులకు మేతగా వేస్తున్నాం



బోరులో నీళ్లు ఉన్నప్పుడు నాలుగు ఎకరాల వరి పంట పారేది. ప్రస్తుతం బోరు ఎండిపోయింది. రెండు ఎకరాలు వరి పంట పూర్తిగా ఎండిపోయింది. పశువులకు నీళ్లు తాగడానికి కూడా కొరత ఏర్పడింది. ఎండిపోయిన వరి పంటను కోసి, ఆవులకు, గేదలకు మేతగా వేస్తున్నాం. పెట్టిన పెట్టుబడి నష్టపోయాం.

– గుండ వసంత, సైదాపురం గ్రామం

ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటం



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలో సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవడానికి నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, సీపీఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన బంగారి, సుబ్బూరు నర్సయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపగాని రాజు, మూనుకుంట్ల నరసమ్మ, మున్సిపల్ కోఆప్షన్ మాజీ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఆరె పుష్ప, మద్దూరు భాగ్యమ్మ, సత్యనారాయణ తదితరులున్నారు.

ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలి

వలిగొండ: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల కోసం పనిచేసే నాయకులను ఎన్నుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య అన్నారు. ఓటర్లను చైతన్యం చేసేందుకు ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కళాయాత్ర శనివారం వలిగొండ మండలంలోని వర్కట్‌పల్లిలో చేరుకుంది. మండలంలోని తుర్కపల్లిలో మంచినీటి ఎద్దడి తీర్చాలని సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి నరేష్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటపాక శివ ఈర్లపల్లి ముత్యాలు, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి గూడూరు బుచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం పోరుబాట

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లిలో శనివారం సీపీఎం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామశివారులో ప్రమాదకరంగా మారిన మూలమలుపుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని, రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ, మండల కార్యదర్శులు దుబ్బాక జగన్, కోట రాంచంద్రారెడ్డి, నాయకులు మంచాల మధు, నోముల కృష్ణారెడ్డి, అశోక్, బుగ్గ లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, పానమొని కృష్ణ, అనసూయ, అలీ, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

మోటకొండూర్: పంట ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం అందించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోటకొండూర్ మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో పంటలను పరిశీలించారు. ఆయన వెంట ఇక్కిరి సహదేవ్, కల్లెపు అడివయ్య, బేజాడి కుమార్, చిరబోయిన రాజయ్య, పున్నపురెడ్డి రాఘవరెడ్డి, సాదుల శ్రీకాంత్, చిరబోయిన కొమురయ్య, బడికె ఉపేందర్ తదితరులున్నారు.

వరిపొలాల పరిశీలన

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం)ను కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం అన్నారు. శనివారం మండలంలోని పోసానికుంట వద్ద ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట రైతు సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల సత్యనారాయణరెడ్డి, రైతులు బడిగె ఐలయ్య, నెమ్మాని నర్సయ్య, బుగ్గ రాములు, జయమ్మ ఉన్నారు.

రాజాపేట: సాగుచేసిన వరి పొలాలు ఎండిపోయాయని, రాజాపేటను కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం కోరారు. శనివారం మండలంలోని సింగారం గ్రామంలో ఎండిపోయిన పంటపొలాలను పరిశీలించారు. ఆయన వెంట ఆకుల బాల నర్సయ్య, పారుపల్లి చంద్రారెడ్డి, బొల్లారం మల్లయ్య, ముచ్చపల్లి సిద్దియ్య, బుచ్చిరెడ్డి, కర్ల కృష్ణారెడ్డి, మల్లారెడ్డి, బండకింది బాలమల్లు ఉన్నారు.

కాన్షీరాంకు ఘన నివాళి



కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరిటౌన్: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలను శనివారం భువనగిరి పట్టణంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాసాని మహేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బహుజన ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ గంధమాల లింగస్వామి, జిల్లా మాజీ అధ్యక్షుడు వేముల బాలస్వామి, బట్టు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి కోరబోయిన పాండు, భువనగిరి అసెంబ్లీ ఇంచార్జ్ గుండు కృష్ణ గౌడ్, బీబీనగర్ మండల అధ్యక్షుడు రాంపల్లి నర్సింగ్ రావు, పట్టణ అధ్యక్షుడు బర్రె నగేష్, సీనియర్ నాయకులు సలిగంజి కిషోర్, మండల నాయకులు పాల్గొన్నారు.

చౌటుప్పల్: బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాం జయంతి వేడుకలను శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ మున్సిపల్ అధ్యక్షుడు కత్తుల పరమేష్, మండల అధ్యక్షుడు మాద రమేష్, నాయకులు మస్కు ఉదయ్, గడ్డమీది బాబూరావ్, సుక్క సుదర్శన్, ఎర్రోళ్ల ఇస్తారి, మాద యాదగిరి, రియాజ్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు కొనుగోలు చేయొద్దు

బొమ్మలరామారం: ప్రతి వస్తువును ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు కొనుగోలు చేయొద్దని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడారి వెంకటేష్ అన్నారు. శనివారం బొమ్మలరామారం మండలంలోని మేడిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. వస్తువు తయారీ, ఎక్స్‌పైరీ తేదీలను సరిచూసుకోవాలని తెలిపారు. కొనుగోలుకు సంబంధించిన బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనంతరం వినియోగదారులను చైతన్య పరిచే హక్కుల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజ్ఞాన



మాట్లాడుతున్న కొడారి వెంకటేష్

వేదిక రాష్ట్ర నాయకులు జిట్టా భాస్కర్ రెడ్డి, ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి బోగ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి

భువనగిరి: గత సంవత్సరం డిసెంబర్ 3న జరిగిన ఇంటర్నేషనల్ సైన్స్ ఒలింపియాడ్ లెవల్– 1 పరీక్షలో భువనగిరి పట్టణంలోని జీనియస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు 22 మంది బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి అభినందించారు.

ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



భూదాన్‌పోచంపల్లి: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో..



మోటకొండూర్‌లో..

భూదాన్‌పోచంపల్లి: సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేసినందుకు నిరసనగా శనివారం భూదాన్‌పోచంపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, నాయకులు పాక వెంకటేశ్, చిట్టిపోలు శ్రీనివాస్, బాత్క లింగస్వామి, రావుల శేఖర్‌రెడ్డి, సార బాలయ్య, చిల్వేరు బాలనర్సింహ, మల్లేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

రామన్నపేట: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడంతో పాటు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో శనివారం రామన్నపేటలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జెట్టి శివప్రసాద్, చినపాక రమేష్, ఆవుల సత్తయ్య, ఎడ్ల రాంచంద్రారెడ్డి, కొండగడప చింటు, భగవంతం, చరణ్ పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

ఆత్మకూరు(ఎం): మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండల కేంద్రంలోని రాయిగిరి -మోత్కూరు మెయిన్‌రోడ్డుపై శనివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావిస్తుంటే మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ పంజాల వెంకటేశం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, బాషబోయిన ఉప్పలయ్య యాదవ్, కోరె భిక్షపతి, మాజీ ఎంపీటీసీ యాస కవిత పాల్గొన్నారు.

మోటకొండూర్: అసెంబ్లీ సమావేశాల నుంచి ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిపై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోటకొండూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎండీ బురాన్, జివిలికపల్లి వెంకటేష్, నల్ల జహంగీర్, దడిగ మధు, బొట్ల ప్రశాంత్, నక్కిర్త ఉప్పలయ్య, రేగు నాగులు పాల్గొన్నారు.

బీబీనగర్: జగదీశ్‌రెడ్డి సస్పెండ్‌ను నిరసిస్తూ మండల కేంద్రంలోని శనివారం బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాచమల్లు శ్రీనివాస్, గాదె కవితానరేందర్ రెడ్డి, భాగ్యలక్ష్మీశ్రీనివాస్, రవికుమార్, సుదర్శన్ రెడ్డి, బాలచందర్, అశోక్, నగేష్, పురుషోత్తమరెడ్డి, అంజయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రాస్తారోకో

సంస్థాన్ నారాయణపురం: ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సస్పెండ్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం సంస్థాన్ నారాయణపురంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య, డీసీసీబీ మాజీ డైరెక్టర్ గడ్డం మురళీధర్‌రెడ్డి, శివరాత్రి విద్యాసాగర్, పార్టీ మండల అధ్యక్షుడు నర్రి నర్సింహ, రమేష్, భిక్షం, తిరుమలేష్, యాదరెడ్డి, రమేష్ తదితరులున్నారు.

బొమ్మలరామారం: మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తి వేయాలని బీఆర్ఎస్ నాయకులు శనివారం బొమ్మలరామారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాల్ నర్సింహ, మాజీ ఎంపీపీ సుధీర్ రెడ్డి, బోనంకూర మల్లేష్, కట్టా శ్రీకాంత్ గౌడ్, భరత్ పాల్గొన్నారు.



బీబీనగర్: రాస్తారోకో చేస్తున్న నాయకులు



సంస్థాన్ నారాయణపురం: రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సెల్‌ఫోన్ చోరీ చేసిన యువకుడిని పోలీసులకు అప్పగింత

భూదాన్‌పోచంపల్లి: సెల్‌ఫోన్ చోరీ చేసిన యువకుడిని గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన శనివారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో చోటు చేసుకొంది. శనివారం స్థానికంగా జరిగిన సంతకు అదే గ్రామానికి చెందిన మెట్టు రాంరెడ్డి కూరగాయలు కొనడానికి వచ్చాడు. ఆ సమయంలో ఓ యువకుడు కింద డబ్బులు పడిపోయాయని, మీవేనా అని చెప్పగా అతను వంగి తీసుకొనే క్రమంలో అతడి జేబులోంచి మొబైల్ ఫోన్ కొట్టేశాడు. గమనించిన రాంరెడ్డి దొంగ, దొంగా అని అరవగా.. పారిపోతున్న యువకుడిని గ్రామస్తులు వెంబడించి పట్టుకున్నారు. దీంతో ఆ యువకుడితో పాటు ఆటోలో వచ్చిన మహిళ, ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులకు సమాచారం ఇచ్చి అతడిని వారికి అప్పగించారు. పట్టుబడిన యువకుడిది ఎల్‌బీనగర్ నందనవనంగా చెప్పాడు. కాగా.. సంతలో రెండు నెలలుగా సుమారు 10 మొబైల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు స్థానికులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

→ ప్రజాచైతన్య వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రామన్నపేట: సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ నుంచి 28 వరకు రామన్నపేట మండలంలో నిర్వహించే ప్రజా చైతన్య పాదయాత్ర పోస్టర్‌ను శనివారం కక్కిరేణి గ్రామంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామశాఖ కార్యదర్శి కన్నెబోయిన యాదయ్య, చింతల నరేందర్, నడిగోటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

→ రామలింగేశ్వరస్వామికి గరుడ సేవ

మోత్కూరు: మున్సిపల్ కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం గరుడ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రామలింగం, వెంకన్న, ఆలయ కమిటీ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, కమిటీ సభ్యులు బుర్ర యాదయ్య, బయ్యని రాజు, అరవింద రాయుడు, మర్రి ఆనందం, పట్వారి అంజయ్య, గుండు శ్రీను, అన్నెపు నర్సింహ్మా, శేఖరాచారి, భిక్షపతి, యాదగిరి, పట్వారి శివ, బుర్ర నర్సయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

→ అసంపూర్తి నిర్మాణాలు పూర్తిచేయాలి

మోటకొండూర్: అసంపూర్తిగా వదిలేసిన శ్మశాన వాటిక, డంపింగ్ యార్డ్ పనులు వెంటనే పూర్తి చేయాలని సీపీఎం మండల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మోటకొండూర్ మండలంలోని ఆరేగూడెం గ్రామంలో పెండింగ్‌లో ఉన్న శ్మశానవాటిక, డంపింగ్ యార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, కొల్లూరి ఆంజనేయులు, కొల్లూరి రమేష్, కొల్లూరి సుధాకర్, కొల్లూరి ప్రసాద్, నగేష్, శ్రీహరి, నాగరాజు ఉన్నారు.

→ జీవన్‌జ్యోతి చెక్కు అందజేత

ఆలేరురూరల్: ఆలేరు మండలం మంతపురి గ్రామానికి చెందిన దంతూరి పరుశరాములు కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు మంజూరైన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన రూ.2లక్షల చెక్కును శనివారం బాధిత కుటుంబసభ్యులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆలేరు బ్రాంచ్ మేనేజర్ సీఎచ్ రామకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది శ్రీనివాస్, బ్యాంక్ మిత్ర రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

→ సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, నాయకులు కొండపల్లి ముత్యాలు, మొలుగు ఉపేందర్, దొంతరబోయిన భాస్కర్, మజ్జిగ రవీందర్, సాంబ పాల్గొన్నారు.

→ పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కవిత, జిల్లా నాయకులు ఇంద్రారెడ్డి, భిక్షపతి, నాగరాజు పాల్గొన్నారు.

→ వైభవంగా సుదర్శన హోమం

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. డాక్టర్ రావుల మోహన్‌రెడ్డి, సంతోష దంపతుల ఆధ్వర్యంలో తెప్పోత్సవం జరిపించారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అంకం వినోద్, ధర్మకర్తలు మోటె మహేశ్, చేరాల సుధీర్‌కుమార్, వేశాల మురళి, కూరపాటి బాబు, నాగయ్య, గునిగంటి సుభాష్‌గౌడ్, పెద్దల ముత్యాలు, రాములు, బాలాజీ, కావ్య, వంగూరి బాలకృష్ణ, పాపని ముత్యాలు, వెంకటేశం, శివకుమార్, జింకల కుమార్, శ్రీను, చెర్కు శ్రీకాంత్, సత్యనారాయణ, చేరాల శ్రీకాంత్, మహేందర్‌రెడ్డి, మణికుమార్ పాల్గొన్నారు.

→ వినియోగదారులకు అవగాహన

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో శనివారం స్థానిక డిఫెన్స్ వినియోగదారుల హక్కుల సంఘం ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు గుమ్మడెల్లి పరశురాములు మాట్లాడుతూ.. వినియోగదారుల రక్షణ, సాధికారికత, హక్కులపై తమ సంఘం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు ఊర సారయ్య, సహాయ కార్యదర్శి కేశవల్ల రాజు, సోషల్ మీడియా ఇన్‌చార్జి మర్రి కమల్‌నాథ్ ఉన్నారు.

→ పేకాట స్థావరంపై పోలీసుల దాడి

బొమ్మలరామారం: పేకాట ఆడుతున్న పలువురు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన బొమ్మలరామారం మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ బుగ్గ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. మర్యాల గ్రామ శివారులో గల తోటలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. వారి నుంచి రూ.81,290 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళా ఉద్యోగులకు సన్మానం



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

వలిగొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వలిగొండ మండలంలోని పులిగిల్లలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను చేయూత ఫౌండేషన్, కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంధ్య, కార్యదర్శి సైదులు, చేయూత ఫౌండేషన్ చైర్మన్ వాకిటి రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు జక్క వెంకట్రెడ్డి, కొమ్మిడి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ బండారు ఎల్లయ్య, పైళ్ల గణపతిరెడ్డి, మాధవి, హైమావతి పాల్గొన్నారు.